క్లుప్తంగా

ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలి

కర్నూలు సిటీ: ఉల్చాల గ్రామంలోని సచివాలయం–2 పరిధిలోని ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మించాలని కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం గ్రామ సచివాలయం–2 ఎదుట ధర్నా నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, మండల కార్యదర్శి ప్రకాష్‌లు మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధుల్లో రోడ్లు వేశారని, ఇంకా ఎస్సీ కాలనీలో వేయలేదన్నారు. దీని వల్ల వర్షం వస్తే ఇళ్ల ముందు నీరు నిలుస్తుందన్నారు.

ఆసుపత్రికెళ్లి పింఛన్ పంపిణీ



ఆసుపత్రిలో అబ్దుల్లాకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మద్దిలేటి

గడివేముల: మండల కేంద్రానికి చెందిన అబ్దుల్లా గుండె జబ్బుతో బాధపడుతూ కర్నూలు విశ్వభారతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన జనవరి నెల పింఛన్ సొమ్ము తీసుకోలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న వలంటీరు మద్దిలేటి సొంత ఖర్చులతో గురువారం ఆసుపత్రికి వెళ్లి వేలి ముద్రలు వేయించుకుని పింఛన్ సొమ్ము అందించాడు. వలంటీర్ తో పాటు గడివేముల జెడ్పీటీసీ ఆర్ బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీటీసీ మహేష్ రెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని వెళ్లి అబ్దుల్లాను పరామర్శించారు.

114 కొత్త పింఛన్లు మంజూరు

సి.బెళగల్: మండలంలో 114 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గ్రామ సచివాలయాల వారీగా బ్రాహ్మణదొడ్డి - 6, బురాన్‌దొడ్డి – 10, గొల్లలదొడ్డి – 3, సి.బెళగల్–1కు 15, సి.బెళగల్– 2కు 8, చింతమానుపల్లె – 6, ఇనగండ్ల – 5, కంబదహాల్ – 13, కొత్తకోట – 7, పోలకల్– 1కు 4, పోలకల్ – 2కు 9, పోలకల్ – 3కు 7, సంగాల – 20, కొండాపురం – 1, ముడుమాల – 1 చొప్పున కొత్త పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. మండలంలో మొత్తం 7,392 మందికి ప్రభుత్వం ప్రతినెలా రూ.2,20,45,500 పింఛను అందిస్తున్నట్లు చెప్పారు.

నేడు పింఛన్ల పంపిణీ

మండల కేంద్రం సి.బెళగల్లో శుక్రవారం నూతన పింఛన్లు, పెరిగిన పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు గురువారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో సభా వేదిక ఏర్పాట్లను సర్పంచ్ పాండురంగన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో కలిసి పరిశీలించారు.

బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఐరన్ మాత్రలను మింగిస్తున్న హేమలత

కోడుమూరు: అపరిచితుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత సూచించారు. గురువారం కోడుమూరులోని మోడల్ స్కూల్‌ను ఆమె సందర్శించి బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ బాలికలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టాలంటే పాఠశాల స్థాయి నుంచే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా వ్యక్తులు అనుచితంగా ప్రవర్తిస్తుంటే అలాంటి వారి గురించి తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. అలాగే రక్తహీనత తగ్గించేందుకు ఎండు ద్రాక్ష, పాలు, గుడ్లు, పండ్లు, వేరుశనగ కలిపి బెల్లం, ఆకుకూరలు తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం బాలికల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలను మింగించారు. ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాబాయి, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం వద్దు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించొద్దని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ కోరారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం ఆలోచన విరమించుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 8న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ధర్నాకు అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలి రావాలన్నారు. సమావేశంలో నాయకులు బి.రాధాకృష్ణ, హుస్సేన్‌వలి, మాలిక్‌బాషా, కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పాణ్యం ఎమ్మెల్యే కాటసానిని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



సామాజిక సాధికార యాత్రలో కార్యకర్తల ఉత్సాహం



వైఎస్సార్‌సీపీ రంగుల బెలూన్లను వదులుతున్న కార్యకర్తలు



హైవే రోడ్డుపైకి ఎక్కి బహిరంగ సభను వీక్షిస్తున్న ప్రజలు

వైఎస్ జగన్‌తోనే సామాజిక సాధికారత

- 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మంత్రి వర్గంలో స్థానం
- జగన్ వెంటే బడుగు, బలహీన వర్గాలు
- రాబోయే ఎన్నికల్లో విజయం తథ్యం
- ప్రతిపక్షాలన్నీ కలిసివచ్చినా సింగిల్‌గానే వస్తాం
- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య



మేధావుల సదస్సులో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సామాజిక సాధికారత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కర్నూలు నగరం కేఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారీలు, మేధావుల ఆత్మీయ సమావేశం, అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం, పార్టీలోనూ పదవులు ఇచ్చి వారు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించారని చెప్పారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలందరూ జగన్ వెంటే ఉన్నారన్నారు. ఎన్నికల ముందు బీసీల సమావేశం నిర్వహించి అధికారంలోకి వచ్చాక వారికి న్యాయం చేసిన నాయకుడు జగనన్నే అన్నారు. తాము చేసిన మంచిని ప్రజలకు వివరించడాని ఈ సామాజిక సాధికారత బస్సు యాత్ర నిర్వహించినట్లు తెలిపారు.

ఎల్లో మీడియా అసత్య ప్రచారం

రాష్ట్రంలో పేదలకు ఇంతల మంచి జరుగుతున్నా.. అది ప్రజలకు తెలియజేయకుండా ఎల్లో మీడియా అసత్యాలను ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులందరికీ కులమతాలు, పార్టీలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలను అక్కున చేర్చుకున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

అణగారిన వర్గాల్లో నాయకత్వం పెరిగింది

గత మూడు, నాలుగు రోజులుగా ఎల్లో మీడియా అణగారిన వర్గాల సీట్లలో మార్పులు చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అణగారిన వర్గాల్లో లీడర్ షిప్ పెరిగిందని కాటసాని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మంత్రి వర్గంలో 25 మంది ఉండగా 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించడమే కాకుండా నలుగురికి ఉప ముఖ్యమంత్రి హోదా ఇవ్వడం జగనన్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. రాబోయే ఎన్నికల్లో కచితంగా 175కు 175 స్థానాలు గెలుస్తామన్నారు. టీడీపీ కుప్పంలో కూడా ఓడిపోతుందని జోష్యం చెప్పారు. రాబోయ్యే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీడీపీ నాయకులు ఏమేమో మాట్లాడుతున్నారన్నారు. గతంలో ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారని అని చంద్రబాబు అవమనపరిచారని గుర్తు చేశారు. బీసీలు మాట్లాడితే తొకలు కత్తిరిస్తానని, ఒక బీసీ జడ్జిగా నియమితులైన సందర్భంలో బీసీలు జడ్జిలుగా పనికి రారని చెప్పిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఇవాళ మళ్లీ అబద్ధాలతో ఏ మోహం పెట్టుకొని జనంలోకి వస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, డీపీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ ఆచారి, ఎస్సీ విభాగం అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు శివ, కర్నూలు, నంద్యాల జిల్లాల మైనార్టీ అధ్యక్షులు జిలాన్ బాషా, యూనస్, ప్రైవేటు విద్యా సంస్థల అధినేతలు పుల్లయ్య, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్రలో వైఎస్సార్‌సీపీ జెండా, ఎమ్మెల్యే చిత్రపటంతో చిందులు వేస్తున్న బొమ్మ వేషధారి



క్రేన్‌తో గజమాలను తీసుకొస్తున్న దృశ్యం



చెన్నమ్మ సర్కిల్‌లో నాయకుల ప్రసంగం వింటూ కేరింతలు కొడుతున్న కార్యకర్తలు



సభావేదికపై నృత్యం చేస్తున్న కళాకారులు

పాఠశాలల రూపురేఖలు మారాయి



రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మనబడి నాడు–నేడు పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తుడంతో అందరికి మేలు జరుగుతోంది.

– విద్యావేత్త పుల్లయ్య

దీటుగా ఎదుర్కోవాలి



రాష్ట్రంలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని మేధావులు, నాయకులు దీటుగా ఎదుర్కొని సమాధానం ఇవ్వాలి. రాష్ట్రంలో 90శాతం సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

– మైనార్టీ నాయకుడు రోషన్ అలీ

గొప్ప నాయకులు చెప్పిన విధంగా పాలన



దేశంలో గొప్పవారైన భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్, ఆర్థిక శాస్త్రంలో నోబెల్ విజేత అమర్త్యసేన్ వంటి నాయకులు చెప్పినట్లుగా సామాజిక స్వేచ్ఛ, మానవవనరుల అభివృద్ధి జరుగుతోంది.

– న్యాయవాది సుబ్బయ్య

గ్రామస్థాయిలో పాలన



గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామ స్థాయిలో ప్రజల చెంతకు పాలన అందుతోంది. వివిధ శాఖలకు చెందిన 10 మంది ఉద్యోగులు ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు.

– రిటైర్డ్ డీఎఫ్ఓ జయచంద్రారెడ్డి

బీసీలకు అధిక ప్రాధాన్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. బీసీలను గుర్తించి వారికి పదవులు ఇచ్చారు. జిల్లాలో మంత్రి గుమ్మనూరు జయరాం, నగర మేయర్ రామయ్య, గ్రంథాలయ చైర్మన్ సుభాస్ చంద్రబోస్‌లకు పదవులు దక్కాయి. ఆర్.కృష్ణయ్యను రాజ్యసభ సభ్యుడిగా చేసి ఢిల్లీకి పంపిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుంది. 14 సంవత్సరాల టీడీపీ పాలనలో అన్ని స్కాములే, నాలుగు సంవత్సరాల వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నీ స్కీములే ఉన్నాయి.

– రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ కర్నూలు మాజీ అధ్యక్షుడు, పురుషోత్తం

అవ్వాతాతలకు అండగా ప్రభుత్వం



కోడుమూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



చనుగొండ్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న కో-ఆప్షన్ సభ్యుడు దౌల

కోడుమూరు రూరల్: పేదల పెన్నిధి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు వారోత్సవాల్లో భాగంగా గురువారం కోడుమూరులోని సంతమార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పింఛన్ సొమ్ముతో అవ్వాతాతలు ఎవ్వరిపై ఆధారపడకుండా ఆనందంగా జీవనం సాగిస్తున్నారని చెప్పారు. తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, నాయకులు భీమిరెడ్డి, సర్పంచు బాలక్రిష్ణ, ప్రభాకర్, విజయ్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం కో–ఆప్షన్ సభ్యుడు దౌల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 25 మందికి కొత్తగా పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వలంటీర్లతో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

జగనన్నకు రుణపడి ఉంటా



నేను గతంలో జీవనోపాధి కోసం హోటల్లో పనిచేసేవాడిని. వయసు మీద పడడంతో పని చేతగాక ఇంటి వద్దే ఉంటున్నా. వృద్ధాప్య పింఛన్ కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం పెంచిన పింఛన్ రూ.3 వేలను ఈ రోజే అందుకున్నా. వృద్ధాప్యంలో నెలకు రూ.3 వేల పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటా.

– కేశాలు, లబ్ధిదారుడు, కోడుమూరు

బస్సు యాత్రకు భారీగా తరలిన అభిమానులు



హుసేనాపురం నుంచి బయలు దేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

ఓర్వకల్లు : వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. గురువారం కల్లూరు మండలంలోని చెన్నమ్మ సర్కిల్‌లో నిర్వహించిన బస్సు యాత్ర బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బస్సులు, జీపులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. 22 గ్రామ పంచాయతీల నుంచి దాదాపు 2వేల మందికి పైగా బహిరంగ సభకు హాజరయ్యారు. కొందరు యువకులు బైక్‌లపై సభ వద్దకు చేరుకున్నారు.

పాణ్యం నుంచి..

పాణ్యం : కల్లూరు మండలంలోని చెన్నమ్మ సర్కిల్‌లో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని గ్రామీణ ప్రాంత శ్రేణులు భారీగా తరలివెళ్లారు. యాత్రకు వెళ్తున్న వాహనాలను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ జెండాను ఊపి ప్రారంభించారు.

'ఆడుదాం–ఆంధ్ర'పై సమీక్ష



క్రీడా జెర్సీలను చూపుతున్న అధికారులు

గూడూరు: ఈ నెల 10న మండల స్థాయిలో నిర్వహించే 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ రాముడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో ఎంపీడీఓ క్రీడాపోటీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మొదటి దశలో సచివాలయ స్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులకు రెండవ దశలో భాగంగా ఈ నెల 10వ తేదీన మండల స్థాయిలో క్రీడలు నిర్వహిస్తామన్నారు. సచివాలయ అధికారులు బాధ్యత తీసుకొని గ్రామ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. తరువాత నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని వివరించారు. గ్రామీణ క్రీడాకారులకు ఇది చక్కటి అవకాశం అని, క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారులకు ప్రభుత్వం ఉచితంగా అందించే వస్తువులను అధికారులు ప్రదర్శించారు. తహసీల్దార్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఎంఈఓ సునీలమ్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పల్లెల్లో సంక్షేమ పండుగ

- 45 రోజుల పాటు నాలుగు పథకాల అమలు
- పండుగలా పింఛన్ పెంపు వారోత్సవాలు
- టీడీపీ నేతల తప్పుడు ప్రచారాన్ని ఖండించాలి
- జనాలకు వాస్తవాలు తెలియపరచాలి
- పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 45 రోజుల పాటు చేపట్టనున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమాలు పల్లె పల్లెల్లో పండుగ వాతావరణంలో నిర్వహించాలని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం స్టాంటన్‌పురంలోని కోడుమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, నాలుగున్నరేళ్ల చేసిన అభివృద్ధిపై నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ విభాగాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు పింఛన్ కానుక పెంపు, జగనన్న ఆసరా, చేయూత, జగనన్న ఆరోగ్య సురక్ష ,ఆడుదాం ఆంధ్ర వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పింఛన్ కానుకల పంపిణీ ఇప్పటికే బ్రహ్మాండంగా ప్రారంభించామని చెప్పారు. రాబోయే రెండు, మూడు నెలలు ప్రతి కార్యకర్త కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసే నిందారోపణలను ఎప్పటికప్పుడు ఖండించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పని చేసి పార్టీని గత ఎన్నికల్లో కంటే భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి

కోడుమూరు నియోజకవర్గంలో ఏళ్లుగా పరిష్కారం కానటువంటి రోడ్ల సమస్యను తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత పరిష్కరించానన్నారు. మొదటి ఏడాదిలోనే వివిధ రకాల నిధులు రూ.100 కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని చెప్పారు. ఈ రోజు ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందుతున్నాయని, ప్రజలు గతంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా నాయకులు చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత గ్రామంలోనే ఆధార్‌కార్డు తీసుకెళ్తే ఏ పథకానికి అర్హత ఉందో చెబుతున్నారన్నారు. పేదల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకొని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అమడగుంట్ల కృష్ణారెడ్డి, సి.బెళగల్ ఎంపీపీ మునెప్ప, జెడ్పీటీసీలు మౌలాలి, గిరిజోన్, ప్రసన్నకుమార్, గూడురు నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి



క్రిష్ణాపురం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కోడుమూరు మండలంలోని క్రిష్ణాపురం, మెరుగుదొడ్డి గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లను నిర్మించి ప్రజల చెంతకే పాలన తెచ్చారన్నారు. కోడుమూరు నుంచి క్రిష్ణాపురం రోడ్డు, వర్కూరు నుంచి పులకుర్తి, మెరుగుదొడ్డి గ్రామాలకు సరైన రోడ్డు లేక గ్రామస్తులు తీవ్ర పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. క్రిష్ణాపురం రోడ్డు నిర్మాణానికి రూ.297 లక్షలు, వర్కూరు నుంచి కల్లపరి, పులకుర్తి మీదుగా మెరుగుదొడ్డి గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.450 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని త్వరలో రోడ్డు నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, స్థానిక నాయకులు అద్దుగల రాజశేఖరరెడ్డి, బలరాం, ప్రతాప్‌రెడ్డి, కొలుట్ల, గిడ్డయ్య, రంగన్న తదితరులున్నారు.